## క్లుప్తంగా

### ముగిసిన ఉత్సవాలు

**ఆత్మకూరు(ఎం):** మండలంలోని కూరెళ్లలో జరుగుతున్న గ్రామ దేవాలయాల ధ్వజస్తంభ, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీసీతా రామచంద్రస్వామి శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాషబోయిన పద్మ, మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య యాదవ్, కూరెళ్ల రమేష్, గడ్డం అశోక్, బాలాజీ, బాషబోయిన సత్యనారాయణ, ఉప్పల నర్సింహ పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

**వలిగొండ :** మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం – 1లో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ ధనమ్మ పాల్గొని గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో విద్యార్థులకు అసైన్మెంట్ యాక్టివిటీస్ నిర్వహించి ప్రతిభ కనబర్చిన చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులను అందించారు. కార్యక్రమంలో వసంత, సుశీల,తల్లులు, గర్భిణులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా బొడ్రాయి పండుగ



బోనాలు ఎత్తుకుని వస్తున్న మహిళలు

**భూదాన్‌పోచంపల్లి :** మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామంలో గురువారం బొడ్రాయి పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు డప్పు వాయిద్యాల మధ్య గ్రామ పురవీధుల గుండా బోనాలను ఎత్తుకుని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నలచ్చి లింగస్వామి, మాజీ ఉపసర్పంచ్ ఆర్ల లింగస్వామి, ఆర్ల వెంకటేశ్‌యాదవ్, సుర్కంటి జంగారెడ్డి, ఆర్ల శంకర్, ఆమన గంటి శివశంకర్, పగుడాల అంజనేయులు, ఎలుక రాజు వెంకటయ్య, నర్సింహాచారి, లక్ష్మీనర్సింహ, శ్రీశైలం, కిష్టయ్య, యాదయ్య, మహేశ్, మల్లేశ్, జగదీశ్ పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం

**భువనగిరిరూరల్ :** మండలంలోని హన్మపురం ఐకేపీ సెంటర్‌లో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పడమటి మాణిక్యం రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు పక్కీరు రాజేందర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు చీరిక సురేష్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి తోటకూరి వెంకటేశ్, ఎడ్ల చంద్రశేఖర్, రామిడి రాంరెడ్డి, జగడాల ఆనంద్ గౌడ్, బొబ్బల అంజిరెడ్డి, గాదె లింగారెడ్డి, గాదె రవీందర్‌రెడ్డి, అచ్చయ్య పాల్గొన్నారు.

### ర్యాలీని జయప్రదం చేయాలి

**భూదాన్‌పోచంపల్లి :** పోచంపల్లి పట్టణకేంద్రంలో శుక్రవారం ఉదయం నిర్వహించనున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి ప్రచార ర్యాలీని జయప్రదం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శశిధర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణకేంద్రంలో ముఖ్య నాయకుల, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు సామ మధుసూదన్ రెడ్డి, కళ్లెం రాఘవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్‌అధ్యక్షుడు తడక వెంకటేశం, పాక మల్లేశ్, భారత లవకుమార్, నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, రమేశ్, బండారు ప్రకాశ్‌రెడ్డి, పక్కీరు మల్లారెడ్డి, రమేశ్, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, కుమార్, వెంకటేశ్, స్వామి పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోవాలి

**ఆత్మకూరు(ఎం):** ఇటీవల కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పలు మామిడి తోటలను సందర్శించి రాలిన మామిడి కాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి నష్ట పరిహారం అంచనా వేయాలన్నారు. ఆయన వెంట నాయకులు నాతి అంజయ్య, లోడి వెంకటయ్య, గడ్డం స్వామి, నర్సింగరావు, మహేష్ పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

**అడ్డగూడూరు :** ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చౌల్లరామారం గ్రామానికి చెందిన తురికిపాటి మత్స్యగిరి గ్రామం నుంచి పనినిమిత్తం నకిరేకల్‌కు వెళ్తున్నాడు. అదే విధంగా మండల పరిధిలోని అజీంపేట గ్రామానికి చెందిన పండుగ సాయిలు, కన్నెబోయిన యాదగిరి నకిరేకల్ నుంచి తమ స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మానాయికుంట బ్రిడ్జిపైకి రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మత్స్యగిరి, సాయిలు, యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ నాగారాజు వెంటనే పోలీస్ వాహనంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మత్స్యగిరి తలకు తీవ్ర గాయం కావడంతో అతడిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

# భువనగిరి గులాబీమయం

- కేసీఆర్ రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన శ్రేణులు
- కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో కేరింతలు, నృత్యాలు



కార్నర్ మీటింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని వింటున్న బీఆర్ఎస్ శ్రేణులు



నృత్యం చేస్తున్న కళాకారులు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

**భువనగిరి :** లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారత్ రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం సాయంత్రం భువనగిరి పట్టణంలో రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు.ఈ నేపథ్యంలో భువనగిరి పట్టణం గులాబీమయం అయ్యింది. రోడ్ షోకు భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. కేసీఆర్ మాట్లాడినంత సేపు యువకులు కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. కార్నర్ మీటింగ్ ముగిసిన అనంతరం కూడా కార్యకర్తలు రావడం కనిపించింది.

**ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు**

రోడ్‌షో సందర్భంగా కళాకారులు నిర్వహించిన ప్రదర్శనలు అలరించాయి. డోలు, నాసిక్ బ్యాండ్, డప్పులు, కోయలు, ఆదివాసీల సంప్రదాయ నృత్యాలు, మహిళలు కోలాటం, బోనాలతో ప్రదర్శనలు, సందీప్ బృందం ఆటపాటలు అకట్టుకున్నాయి. ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి వేదికపైనుంచి సుద్దాల అశోక్‌తేజ రాసిన ఒకటే జననం, ఒకటే మరణం పాటను పాడి శ్రేణులను ఉత్సాహపరిచారు.

**భారీ బందోబస్తు**

రోడ్ షో సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భువనగిరి పట్టణంలోకి వచ్చే వాహనాలను బైపాస్ గుండా మళ్లించారు. నల్లగొండ రోడ్డు మార్గంలో వచ్చిన వాహనాలను ఖిలా కింది భాగం, బస్టాండ్ ఆవరణలో, హైదరాబాద్ వైపు నుంచి వచ్చిన వాహనాలను ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో, ఆలేరు వైపునుంచి వచ్చిన వాహనాలను ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల వద్ద పార్కింగ్ చేశారు.

**పాల్గొన్న ముఖ్య నేతలు**

రోడ్‌షోలో మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర రెడ్డి, కొల్పుల అమరేందర్, భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ అంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, అబ్బగాని వెంకట్, చిరంజీవి, శ్రీనివాస్, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, వివిధ మండలాల అధ్యక్షులు, రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

**ఆలేరు మీదుగా భువనగిరికి..**

**యాదగిరిగుట్ట:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర గురువారం ఆలేరు మీదుగా భువనగిరికి వెళ్లింది. ఆలేరుకు సాయంత్రం 5:30 గంటలకు కేసీఆర్ బస్సు యాత్ర చేరుకుంది. ఆలేరు, బాహుపేట స్టేజీ మీదుగా వంగపల్లి నుంచి రాయగిరికి బస్సు యాత్ర సాగింది. బైపాస్ రోడ్డులో ప్రజలకు కేసీఆర్ అభివాదం చేశారు. కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సుతోపాటు వందలాది వాహనాలు భువనగిరికి వెళ్లాయి.

## ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, వేదికపై ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

**చౌటుప్పల్ :** గ్రామాల్లో ప్రశ్నార్థకంగా మారిన ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు కందుల మల్లారెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరకపోవడంతో మూతపడుతున్నాయన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదన్నారు. సమాజాన్ని తీర్చిదిద్దే అవకాశం కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే లభిస్తుందని తెలిపారు. దోసూరు బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాచారి, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, మిర్యాల దామోదర్, మెతుకు సైదులు, ఎడ్ల సైదులు, యాదయ్య, ముత్యాలు, రవికుమార్, సైదారెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా రహిత దేశంగా నిర్మించుకోవాలి



భువనగిరి : ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ పాపారావు

**భువనగిరి :** భారత దేశాన్ని మలేరియా రహిత దేశంగా నిర్మించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై.పాపారావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి నిర్వహించిన మలేరియా అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా నిర్మూలన కోసం ప్రతిఒక్కరూ పోరాటం చేయాలన్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకున్నట్లయితే దోమల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు దోమ తెరలను వాడాలన్నారు. మలేరియా నివారణపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రామకృష్ణ, సుమన్ కళ్యాణ్, వంశీకృష్ణ, యామిని, ఎఎంఓ ఎస్ మధుమోహన్‌రావు, ఇస్తారి, మధుసూదన్‌రెడ్డి, సాయిరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**రామన్నపేట :** మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని వైద్యాధికారి అశ్వినికుమార్ అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రకళ, గో పాలు, అండాలు, విజయకుమారి, అరుందతి, ఆదిలక్ష్మీ, గౌసియా, మంజుల రజిత, శ్యామల, కవి త, ప్రశాంతి, సంధ్య, విజయ, పద్మ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడేది వామపక్షాలే



చౌటుప్పల్ : ప్రచారం నిర్వహిస్తున్న చెరుపల్లి సీతారాములు



ఆలేరు రూరల్ : కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

**చౌటుప్పల్ :** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసేది వామపక్షాలే అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ చౌటుప్పల్ మండల పరిధిలోని అంకిరెడ్డిగూడెం గ్రామంలో గురువారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో ప్రజలు సీపీఎంకు అవకాశం ఇవ్వాలన్నారు. మూడు దశాబ్దాలుగా ప్రజల పక్షాన ఉద్యమాలు నిర్వహించిన జహంగీర్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. అవకాశవాద కాంగ్రెస్, మతోన్మాద బీజేపీ, నిరంకుశ బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల, మున్సిపల్ కార్యదర్శులు గంగదేవి సైదులు, బండారు నర్సింహ, కరుణాకర్, గంగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజు, పెంటయ్య, అండాలు, వెంకటేశం, నాగలక్ష్మి, శంకరయ్య, భిక్షం పాల్గొన్నారు.

**ఆలేరురూరల్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎంను గెలిపించాలని ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. మండలంలోని శర్బనాపురం గ్రామంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రజా ఉద్యమాల్లో ఉంటూ ప్రజా సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. తనను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరాజు, వెంకటేష్, నవీన్, పాల్, శంకర్, నర్సయ్య, స్వప్న, సిద్దులు, నరేష్ పాల్గొన్నారు.

**భువనగిరి రూరల్ :** సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. మండలంలోని నందనం, నమాత్‌పల్లి, తుక్కపురం, బొల్లెపల్లి, నాగిరెడ్డిపల్లితో పాటు పలు గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి పాండు, కె.నరేంద్ర, రామారావు, మండల ప్రధాన కార్యదర్శి దయ్యాల నర్సింహ, ఎల్లంల వెంకటేశం, యాదగిరి, ఈర్లపల్లి ముత్యాలు, సుర్పంగ ప్రకాష్, దానయ్య, శివ పాల్గొన్నారు.

**బొమ్మలరామారం :** లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎం.డీ జహంగీర్‌ను గెలుపించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొప్పని పద్మ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన పార్టీ మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తులనే గెలిపించాలన్నారు. అనంతరం జహంగీర్ గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, సభ్యులు మెక్కెర్ల పున్నమ్మ, సల్లూరి కుమార్,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**భూదాన్‌పోచంపల్లి :** సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అధిక మెజార్టీతతో గెలిపించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కూరపాటి రమేశ్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, కోడె బాల్‌నర్సింహ, కోట రామచంద్రారెడ్డి, మంచాల మధు, అనిల్‌రెడ్డి, యాదగిరి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలి



భువనగిరి : సమావేశంలో మాట్లాడుతున్న శిల్పారెడ్డి



తుర్కపల్లి : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

**భువనగిరి:** ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు ఇంటింటా వివరించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, మహిళా శక్తి సమ్మేళన్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయలక్ష్మి అన్నారు. గురువారం భువనగిరి పట్టణ శివారులోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ మహిళా శక్తి సమ్మేళన్ కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడారు. బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. మహిళల అభివృద్ధి బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత బీజేపీకే దక్కుతుందని పేర్కొన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ, భువనగిరిలో బూర నర్సయ్యగౌడ్ గెలుపు ఖాయమన్నారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కస్తూరి మాధురి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమతారెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్షురాళ్లు రమాదేవి, శకుంతల, కాశమ్మ, లావణ్య, వైజయంతి, ప్రియదర్శిని సుకన్య, శ్రీలత, రాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం**

**ఆలేరురూరల్ :** బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ అన్నారు. ఆలేరు పట్టణ కేంద్రంలో గురువారం నిర్వహించిన ఓబీసీ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్, శ్రీనివాస్, మహేష్, సందీప్, ఆనంద్ పాల్గొన్నారు.

**బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలి**

**గుండాల:** బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం మండలంలోని పాచిల్ల, నూనెగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈజీఎస్‌లో పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వెల్మజాల గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు రావుల మల్లేష్, శ్రీనివాస్, సోమనర్సయ్య, అరిగె లక్ష్మణ్, విజయ్‌రెడ్డి, ప్రభాస్‌రాజ్, వివాకర్‌రెడ్డి, రేణుక, అంబదాస్, సాయితేజ, నాగిరెడ్డి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**తుర్కపల్లి:** కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని గంధమల్ల గ్రామంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి ఉట్కూరి అశోగ్‌గౌడ్, ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, ఫకిర్ రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ఆనంద్‌గౌడ్, నరేందర్‌నాయక్, వెంకటేశం, వెంకట్‌రాంరెడ్డి, రమేశ్‌నాయక్, కనకయ్య, నర్సింహులు, శోభన్‌బాబు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేయాలి**

**వలిగొండ :** మే 1వ తేదీ నుంచి 8 వ తేదీ వరకు మండలంలో నిర్వహించనున్న బీజేపీ కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేయాలని భువనగిరి అసెంబ్లీ ప్రభారి మోతేపాక సాంబయ్య అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీజేపీ పదాధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కొప్పుల యాదిరెడ్డి, రాచకొండ కృష్ణ, బోళ్ల సుదర్శన్ , లింగ స్వామి,మారోజు అనిల్ కుమార్, డోగిపర్తి సంతోష్,అశెట్టి సంతోష్, రాములు, దయాకర్, నాగరాజు, మహేష్, అరుణ్, రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రచార కరపత్రం అందజేత**

**భువనగిరి :** బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని తెలంగాణవాదుల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ భువనగిరి శ్రీనివాస్‌నేత అన్నారు. గురువారం బీజేపీ ఎంపీ ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రామచందర్‌గౌడ్, జగదీష్ యాదవ్, మల్లేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**భువనగిరి :** ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ కోసం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో మొత్తం 6 కేంద్రాలు ఏర్పాటు చేశారు. గురువారం జరిన టెన్త్ పరీక్షలకు మొత్తం 398 మంది విద్యార్థులకు గాను 335 మంది విద్యార్థులు హాజరు కాగా 63 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు మొత్తం 721 మంది హాజరుకావాల్సి ఉండగా 628 మంది హాజరు కాగా 93 మంది గైర్హాజరైనట్లు డీఈఓ కె నారాయణరెడ్డి తెలిపారు.


## మాధాపూర్‌లో సంబరాలు

**తుర్కపల్లి:** నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మల్లన్న సొంత గ్రామం మాధాపూర్‌లో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కొడూరి కొమురయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శ్రీనివాస్, శెట్టయ్య, కొమ్మిరిశెట్టి నర్సింహులు, శ్రీనివాస్, నిఖిల్‌గౌడ్, వెంకటేశ్, మహాదేవుని బాల్‌లింగం, వెంకటేశం, చంద్రమౌళి, సుదర్శన్ పలువురు నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## టీ-నేతన్న యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**భువనగిరిటౌన్ :** ప్రభుత్వం రూపొందించిన టీ-నేతన్న యాప్‌ను కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళీశాఖ సహాయ సంచాలకుడు విద్యాసాగర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. త్రిఫ్టులో ఉన్న ప్రతి ఒక్క వీవర్లు, వర్కర్లు ఈ నెల 30వ తేదీలోపు టీ నేతన్న యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. త్రిఫ్టు కడుతూనే టీ నేతన్న యాప్‌లో ఇంకా నమోదు చేసుకోలేదని పేర్కొన్నారు. టీ నేతన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుని వివరాలను యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

## ఉపాధి హామీ కూలీలకు సరైన పని కల్పించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శోభారాణి

**బీబీనగర్:** ఉపాధి హామీ కూలీలకు సరైన పని కల్పించి రూ.250 కూలి వచ్చేలా చూడాలని జెడ్పీ సీఈఓ శోభారాణి అధికారులకు సూచించారు. బీబీనగర్ ఎంపీడీఓ కార్యాలయంలో బీబీనగర్, పోచంపల్లి మండలాల అధికారులతో ఉపాధి హామీ పనులపై గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి జీపీలో రోజుకు 100 మంది కూలీలు పనికి వచ్చేలా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ సురేష్, ఎంపీడీఓలు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, ఏపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వరి పంట కోత ప్రయోగం

**భూదాన్‌పోచంపల్లి :** మండలంలోని దోతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాలలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వరి పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఎంపిక చేసిన రైతుల పొలంలో కోతకు వచ్చిన వరిపంట దిగుబడిని తూకం వేసి చూశారు. అలాగే రైతులు అవలంబించిన సస్యరక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంటలసాగులో తీసుకోవాల్సిన మెలకువలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి అనురాధ, డీఎస్‌ఓ అమరేందర్, మండల వ్యవసాయాధికారి ఏజాజ్ అలీఖాన్, ఏఎస్‌ఓ వినోద్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఏఈఓ నరేశ్, రైతులు పాల్గొన్నారు.

## కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

**ఆలేరురూరల్ :** కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఆలేరు మున్సిపల్ కేంద్రంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు వచ్చే లోక్‌సభ ఎన్నికలు కీలకం కానున్నాయని, బీజేపీని ఓడిస్తే ప్రజాస్వామ్యానికి మనుగడ ఉంటుందన్నారు. భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, పద్మ, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, ఎజాజ్, సాగర్, లోకేష్, రాజు, అజయ్ పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ప్రలోభాలకు గురికావొద్దు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

**భువనగిరి క్రైమ్ :** ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ హనుమంతు కె జెండగే, డీసీపీ రాజేష్ చంద్రా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి మండలంలోని రాయగిరి గ్రామంలో గురువారం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రజలు ధైర్యంగా ఓటు వేయాలన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్లయితే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అమరేందర్, తహసీల్దార్ అంజిరెడ్డి, రూరల్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐలు సంతోష్ కుమార్, శివనాగప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

**బొమ్మలరామారం :** మండలంలోని మునీరాబాద్ గ్రామంలో గురువారం ఎమ్మార్పీఎస్ కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా జోగు నర్సింహ, శ్రీపతి బాలయ్య, ఉపాధ్యక్షులుగా తొంట సత్యనారయణ, బంగారీ ఖాసీం, శ్రీపతి రాజు, ప్రచార కార్యదర్శులుగా శ్రీపతి ముత్యాలు, తొంట మహేష్, కార్యవర్గ సభ్యులుగా జోగు నితిన్, బాలేష్, తొంట ప్రకాష్, బుల్కి నవీన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ జంగయ్య, రామస్వామి,మాజీ సర్పంచ్ అరుణ యాదగిరి, స్వామి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో పలువురి చేరిక

**భువనగిరి టౌన్ :** మండలానికి చెందిన పలువురు గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, కోదండరెడ్డిల సమక్షంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అందెల లింగం యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బొల్లెపల్లి మాజీ సర్పంచ్ గోద శ్రీనివాస్ గౌడ్, చిన్నం శ్రీనివాస్, గోద రాహుల్ గౌడ్, నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

**రామన్నపేట:** మండలానికి వివిధ పార్టీల నాయకులు గురువారం భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సింగిల్‌విండో చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తాళ్లపల్లి సత్తిరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పోచబోయిన నర్సింహ, బొక్క పురుషోత్తంరెడ్డి, మీర్జా బషీర్‌బేగ్, మన్సూర్‌అలీ, అస్లాంబేగ్, అన్వర్, కాటెపల్లి యాదయ్య, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**మోత్కూరు :** మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాపురం గ్రామ బీఆర్ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జినుకల కనకయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు వర్రె సోమయ్య, గ్రామ శాఖ ఉపాధ్యక్షులు అంకిరెడ్డి రాములు, జటంగి నరేందర్, రాములు, జటంగి రాములు, వర్రె లింగయ్య, నల్ల లింగయ్య, వర్రె వెంకటయ్య, అంకెర్ల రమేష్, వర్రె మధు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జటంగి అశోక్, నర్సింహ తదితరులున్నారు.

## వాహనాల తనిఖీ

**భువనగిరిటౌన్ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోకి వచ్చే వాహనాలను కలెక్టరేట్ వద్ద తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా నగదు, అక్రమ మద్యం, తరలింపును అడ్డుకునేందుకు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## ధాన్యం తూకంలో మోసాలను అరికట్టాలి

**భూదాన్‌పోచంపల్లి :** ధాన్యం తూకంలో మోసాలను అరికట్టాలని రైతు సంఘం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గౌస్‌కొండ, శివారెడ్డిగూడెం, ఇంద్రియాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో మంచాల మధు, రైతులు పాల్గొన్నారు.

## హెజెలో కంపెనీలో తనిఖీలు



హెజెలో ల్యాబ్‌లో నీటి శాంపిల్స్‌ను సేకరిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

**భూదాన్‌పోచంపల్లి :** మండలంలోని దోతిగూడెంలోని హెజెలో ల్యాబ్ కంపెనీలో నిబంధనలకు విరుద్ధంగా భూమిలోకి వ్యర్థ రసాయనాలు వదులుతున్నారని ఫిర్యాదు మేరకు గురువారం కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ ఈఈ సురేశ్, సైంటిస్ట్ డాక్టర్ రామకృష్ణ తనిఖీలు చేపట్టారు. కంపెనీ ఆవరణలో పారబోసిన వ్యర్థరసాయనాల శాంపిల్స్ సేకరించారు. కంపెనీ యజమానులతో మాట్లాడి రసాయన వ్యర్థాలు ఎందుకు వదిలారని ప్రశ్నించి వారి నుంచి వివరాలను నమోదు చేసుకొన్నారు. అనంతరం పీసీబీ ఈఈ సురేశ్ విలేకరులతో మాట్లాడారు. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని గ్రామస్తులు తమకు, పీసీబీ సీఈకి వీడియో క్లిప్‌లు పంపించారని, దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి శాంపిల్స్‌తో పాటు ఒక మట్టి శాంపిల్స్‌ను సేకరించామని, నీరు కెమికల్ వాసన వస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. శాంపిల్స్‌ను సెంట్రల్ ల్యాబ్‌కు పంపిస్తామని, ఆ తరువాత వచ్చే నివేదిక ఆధారంగా కంపెనీపై చర్యలు తీసుకుంటామని అన్నారు. కంపెనీలను ఇక్కడ నుంచి వెంటనే తరలించాలని మాజీ సర్పంచ్ బాలెం మల్లేశ్‌యాదవ్, రైతులు ముద్దం సత్యం, బాలెం మల్లయ్య, మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.